క్లుప్తంగా

లోక్‌అదాలత్‌తో సమస్యల పరిష్కారం

చీరాల రూరల్: స్థానిక కోర్టు భవన సముదాయాల్లో సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఎం. సుధ పేర్కొన్నారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు నిర్వహించే ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, వివాహ సంబంధ కేసులు, చెక్‌బౌన్స్, ప్రామిసరీ నోట్ల కేసులు, బ్యాంకు, టెలిఫోన్, మున్సిపాలిటీ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ మార్గంలో కేసులను పరిష్కరిస్తామని న్యాయమూర్తి తెలిపారు. కనుక కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దీర్ఘకాలంగా కోర్టుల్లో పెండింగులో ఉన్న కేసులను రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. అదాలత్‌లో రాజీ మార్గంలో పరిష్కారం అయిన సివిల్ కేసులలో కక్షిదారులు కోర్టుకు చెల్లించిన కోర్టు ఫీజులు తిరిగి కక్షిదారులకు చెల్లిస్తారని న్యాయమూర్తి పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం


పోలీస్ స్టేషన్ వద్ద పట్టుబడిన ట్రాక్టర్‌తో ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: చల్లారెడ్డిపాలెం గ్రామం శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆరుతడి పంటలతో మంచి దిగుబడులు


మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ కాశీవిశ్వనాథ్

వేటపాలెం: రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ సూచించారు. మంగళవారం కొత్తపేట పంచాయతీ పరిధిలో సాగుచేసిన మినుము పంటను ఏఓ పరిశీలించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి పంటకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతుకు పలు సూచనలు ఇచ్చారు. పంటను వారం రోజుల లోపల రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ గోపి, రైతులు పాల్గొన్నారు.


గ్రామం మధ్యలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్


కాయలు కాసిన డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు

డ్రాగన్ ఫ్రూట్.. లాభాలు ఫుల్

- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న బేల్దారి మేస్త్రీ
- 40 సెంట్ల భూమిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన సాయం
- ఏడాదికి రూ. 1.50 లక్షల ఆదాయం

వేటపాలెం: అతను ఒక పనిమీదే ఆధారపడలేదు. ఏదో ఒకటి చేయాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తరుణంగా తనకున్న కొద్దిపాటి స్థలంలో పంటను సాగు చేశాడు. దీంతో అతను లాభాల బాట పడుతున్నాడు. రెండేళ్ల కిందట సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ ప్రస్తుతం దాని ఫలాలను రైతుకు అందిస్తోంది. బేల్దారీ మేస్త్రీగాను, ఇటు రైతుగాను రాణిస్తూ పలువుకి ఆదర్శంగా నిలుస్తున్నాడు షేక్ జిలానీ. రామన్నపేట పంచాయతీ రావూరిపేటకు చెందిన షేక్ జిలానీ బేల్దారీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 2023లో రావూరిపేట శివారులో తనకు ఉన్న 40 సెంట్ల భూమిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేద్దామని నిర్ణయించుకున్నాడు. అందుకు తగిన పెట్టుబడి లేకపోవడంతో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామీణ ఉపాధి పథకం అధికారులను సంప్రదించాడు. పండ్ల తోటల పెంపకం పథకం కింద ఆ పథకం కింద రూ. 1.92 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో తనకున్న 40 సెంట్లలో రెండేళ్ల కిందట డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటాడు.


డ్రాగన్ ఫ్రూట్

లోకల్‌గా విక్రయం..

గత ఏడాది నుంచి సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ ఫలాలను అందిస్తోంది. ప్రస్తుతం ఈ ఏడాది రెండో పంట ఫలాలు కోతకు వచ్చాయి. గత ఏడాది చిన్నచిన్న మొక్కలు అయినందున కొద్దిపాటి దిగుబడి వచ్చి ఆదాయం సమకూరింది. ప్రస్తుతం ఈ ఏడాది కాపు బాగా ఉంటంతో మంచి లాభం వచ్చిందని రైతు తెలిపాడు. ఈ పంటకు పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువగా ఉంటుంది. పండించిన కాయలను లోకల్‌గానే విక్రయిస్తున్నారు. కిలో రూ. 150 చొప్పున విక్రయిస్తున్నాడు. అయితే ఇందులో రెండు రకాలు కాయలు ఉన్నాయి. ఒకరకం కాయ లోపల భాగం గుజ్జు ఎరుపుగా ఉండి మంచి రుచిగా ఉంటుంది. మరో రకం కాయ లోపలి భాగం గుజ్జు తెలుపు రకంగా ఉంటుంది. అయితే ఇది అంత రుచికరంగా ఉండదు. ప్రస్తుతం ఇక్కడ సాగు చేసిన రకం ఎరుపు రకం కాయలు అయినందున రుచిగా ఉంటంతో మంచి ధర పలుకుతోంది. మేస్త్రీగా పని చేస్తూ డ్రాగన్ ఫ్రూట్ పంట పండించి పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు జిలానీ.

ప్రతి ఏడాది ఆదాయం పెరుగుతుంది..



పంట సాగు చేసిన రెండేళ్లయింది. అయితే మొదటి ఏడాది మొక్క చిన్నసైజు అవడం వల్ల పంట తక్కువ మొతాదులో వచ్చింది. ప్రస్తుతం రెండో ఏడాది పంట బాగా వచ్చింది. అందువల్ల ఆదాయం పెరిగింది. ప్రతి ఏడాది ఆదాయం పెరుగుతుంది. ఈ ఏడాది రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని అనుకుంటున్నాను. ఇప్పటికే కొంత పంట కోసి విక్రయించాను. ఇంకా కోయాల్సిన పంట చాలా ఉంది. మళ్లీ పూత ఇస్తుంది.

– షేక్ జిలానీ, రావూరిపేట

చిన్నారులతో వెట్టిచాకిరి చేయిస్తే చర్యలు

చీరాల రూరల్: చిన్నారులను పనుల్లో పెట్టుకుని వారితో బలవంతంగా వెట్టిచాకిరి చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కార్మికశాఖ అధికారి రామకృష్ణ అన్నారు. కార్మికశాఖ, షాడోస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చీరాల పట్టణ, పరిసర ప్రాంతాల్లో పలు దుకాణాలు, మెకానిక్ షాపుల్లో చైల్డ్ లేబర్ కోసం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఒక దుకాణంలో బాలుడు పనులు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో అధికారులు దుకాణ యజమానికి కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలతో పనులు చేయించడం నేరమని తెలియజేశారు. 14 ఏళ్లలోపు బాల, బాలికలను పనులలో పెట్టుకుని వారితో వెట్టిచాకిరి చేయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. గుర్తించిన ఆ బాలుడిని అధికారులు స్వయంగా స్కూలుకు తీసుకెళ్లి స్కూల్లో చేర్పించారు. షాడోస్ సంస్థ ప్రతినిధి ఆల్ఫ్రెడ్ రాజా సాల్మన్ మాట్లాడుతూ సమాజంలో బాల కార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. వెట్టిచాకిరి, మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలని, వీటన్నింటికి ఒకదానితో ఒకటి అనుసంధానం కలిగి ఉండడం వలన సమగ్రంగా కార్యచరణ చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్టుమెంట్ రాము, కిషోర్, షాడోస్ సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలలో గుర్తించిన బాలుడితో అధికారులు

ఉత్తమ గ్రంథపాలకుడికి సన్మానం


సుగుణరావును సన్మానిస్తున్న విశ్రాంత సబ్‌కలెక్టర్, జిల్లా గంథ్రాలయ సంస్థ కార్యదర్శి

అద్దంకి రూరల్: 78వ స్వాతంత్రదినోత్సవం సందర్బంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉత్తమ గ్రంథ పాలకుడిగా అవార్డు అందుకున్న అద్దంకి లైబ్రేరియన్ సీహెచ్ సుగుణరావును మంగళవారం జిల్లా గంథ్రాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ, విశ్రాంత సబ్ కలెక్టర్ పేరయ్య ఘనంగా సన్మానించారు. పదిమంది విద్యార్థులకు గ్రంథాలయంలో సభ్యత్వాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సుగుణరావును అభినందించారు.

35 గేదెలకు, ఆవులకు చూడి పరీక్షలు


దూడలకు పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

చినగంజాం: రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా చినగంజాం మండలం చింతగుంపుల గ్రామం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టిబాబు, చినగంజాం డాక్టర్ బండ్లమూడి కిరణ్ 35 గేదెలకు, 7ఆవులకు చూడి పరీక్షలు, 25 దూడలకు సాధారణ వైద్యం చేసి మందులు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి పేర్లు రత్నకుమార్, విలేజ్ అసిస్టెంట్ ఆదయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పటిష్టంగా ఫీవర్ సర్వే


స్వర్ణలో ఇంటింటి ఫీవర్ సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది


పంగులూరులో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

స్వర్ణ (కారంచేడు): వాతావరణ మార్పులతో గ్రామాల్లో విష జ్వరాలు విజృంభించకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు ఫీవర్ సర్వేలను గ్రామాల్లో వైద్య సిబ్బంది పటిష్టంగా నిర్వహించాలని స్వర్ణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షాలిని అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ, కొడవలివారిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, డీఎంహెచ్‌ఓ సూచనలతో ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నామన్నారు. కొన్ని ప్రాంతాల్లో విష జ్వరాలు ఉన్నట్లు వస్తున్న వార్తలకు స్పందించి ప్రతి ఇంటిలోని ప్రజల ఆరోగ్య స్థితిగతులను అధ్యయనం చేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది ఇంటికి వెళ్లి ఆ ఇంటిలో ప్రజలు ఎంత మంది ఉన్నారు, వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఈ సీజన్‌లో వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలపాలన్నారు. కాచి కల్లార్చిన నీటిని తాగడంతో పాటు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను అలవరచుకోవాలని వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరులో పారిశుధ్య పనులు..

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామ పంచాయతీలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువ వెంట బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ గుడిపూడి నాగేంద్ర మాట్లాడుతూ మురుగు కాలువలో నీటిని నిలబడకుండా చూసుకోవాలని కోరారు. మురుగు నిల్వ ఉన్న చోట దోమలు వ్యాప్తి చెంది కుట్టి రోగాలు వ్యాపిస్తాయని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ పంచాయతీ సిబ్బందికి సహకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దోమల నివారణతో రోగాలు దూరం

చినగంజాం: దోమల ఉత్పత్తిని నివారించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేద్దామని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎస్ విజయభాస్కర్, డాక్టర్ పీ సాయిశ్రీచరణ్‌సు అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది మంగళవారం చినగంజాంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ దోమలు సంతానోత్పత్తి చేసే ప్రదేశాలను గుర్తించి సమూలంగా నిర్మూలన చేయాలని, ఆరోగ్యవంతమైన సమాజానికి శ్రీకారం చుట్టాలని సూచించారు. సమాజ భాగస్వామ్యంతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులను నివారిద్దాం, దోమలు పుట్టకూడదు, దోమలు కుట్టకూడదు వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకొని దోమలు ఉత్పత్తి లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులు ప్రజలకు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలని మలేరియా, డెంగీ వ్యాధులు, దోమలు ద్వారా వచ్చు ఇతర వ్యాధులను కూడా పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చీరాల సబ్ యూనిట్ అధికారి పీ శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ ఝాన్సీరాణి, సూపర్‌వైజర్ చిరంజీవి, ఉల్దారాణి, పీహెచ్‌ఎన్ బేబి, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశలు, ఎల్‌టీ శ్యాంసుందర్, మురళి, మహేష్, ఎంఎన్‌ఓ సుబ్బారావు, కావ్య, సింగయ్య ర్యాలీలో పాల్గొన్నారు.


చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హత్యాచార దోషులకు ఉరే సరైన శిక్ష


గడియార స్తంభం సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


పర్చూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చీరాల: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషులను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చీరాలలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమానికి బీజేపీ, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మద్దతు పలికాయి. హైస్కూల్ రోడ్డు నుంచి ర్యాలీ చేపట్టి గడియార స్తంభం సెంటర్ వద్ద మానవహారం చేశారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువస్తున్నా అవి సరైన పద్ధతిలో అమలు కాలేకపోతున్నాయన్నారు. దేశంలో స్త్రీలపై రక్షణ లేకుండా పోయిందన్నారు. అయితే చట్టాలను ప్రభుత్వాలు మాత్రమే అమలు చేయాలనుకోకుండా ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు యువకులను పద్ధతిగా పెంచడంతో అసలు చట్టాలు అవసరం కూడా ఉండదన్నారు. దేవుళ్లతో కొలిచే డాక్టర్లకే రక్షణ లేకపోతే సామాన్య మహిళలకు ఏ విధంగా రక్షణ ఉంటుందో అర్థం కావడం లేదన్నారు. డాక్టర్ హత్యకు అక్కడి సీఎం పూర్తి బాధ్యత వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా సభ్యురాలు జి.భవాని, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాశన మణికుమార్, జిల్లా సెక్రటరీ కాకర్ల వెంకటేశ్వర్లు, రైల్వే కమిటీ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో కొవ్వొత్తుల ర్యాలీ

పర్చూరు (చినగంజాం): కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి హత్యచేసిన ఘటనకు నిరసనగా బాపట్ల జిల్లా పర్చూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు స్థానిక పెట్రోలు బంకు నుండి బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఘటనకు కారకులైన దోషులను వెంటనే శిక్షించాలని నినాదాలు చేశారు.కార్యక్రమంలో జనసేన నాయకులు కఠారి సురేంద్ర, తులసి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన కేశఖండన శాల ప్రారంభం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండలో నూతన కేశఖండన శాలను మంగళవారం దేవస్థాన ఏసీ సుభద్ర ప్రారంభించారు. భాస్కర్ టెక్స్‌టైల్స్, క్లాత్ ఏజన్సీస్ సూరత్‌కు చెందిన వ్యాపారి నర్రా విజయ భాస్కరరావు, విజయలక్ష్మీ కేశఖండన శాల నిర్మాణానికి రూ. 17 లక్షల అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.


కేశ ఖండనశాలను ప్రారంభిస్తున్న దేవస్థాన ఏసీ సుభద్ర

త్రినోత్రం..

- పనిచేయని సీసీ కెమెరాలు
- విజృంభిస్తున్న చిల్లర దొంగలు
- పట్టించుకోని అధికారులు

వేటపాలెం: ప్రస్తుత సమాజంలో ఏదైనా సాక్ష్యాధారాలు దొరకడంలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకంగా మారుతున్నాయి. 90 శాతం ఆధారాలు సీసీ కెమెరాల వల్లే లభ్యమవుతుంటాయి. అలాంటి కెమెరాల నిర్వహణలో పోలీసులు చేతులెత్తేశారు. మండల పరిధిలో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు నిద్దరోతున్నాయి. గతంలో వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 37 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దాదాపు వీటి పరిధి ఏడు కిలో మీటర్ల వరకు ఉంది. ప్రధాన సెంటర్లు, అక్కాయిపాలెం, వేటపాలెం బైపాస్ రోడ్డు కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా పందిళ్లపల్లి వద్ద కూడా ఏర్పాటు చేశారు. వేటపాలెం, దేశాయిపేట ప్రధాన రహదారిల్లో అన్ని చోట్లు రూ. లక్షలు పెట్టి ఏర్పాటు చేశారు.

37లో మూడు మాత్రమే..

37 సీసీ కెమెరాల్లో ప్రస్తుతం మూడు సీసీ మాత్రమే పనిచేస్తున్నాయంటే పోలీసులకు ఎంత శ్రద్ధనో అర్థమవుతోంది. వివిధ కారణావల్ల అవి మరమ్మతులకు గురయ్యాయి. వీటిని ఇప్పటివరకు మరమ్మతు చేయలేదు. పోలీసులు ఎన్నికల డ్యూటీల్లో బీజీగా ఉండటం, ఎన్నికలు పూర్తయిన తరువాత అధికారులు బదీల్లో బీజీగా ఉండటం వంటి పలు కరాణాల వల్ల సీసీ కెమెరాలను పట్టించుకోలేదు. ప్రధానంగా ఎదైనా దొంగతనం, లేదా యాక్సిడెంట్‌లు, గొడవలు జరిగిన సందర్భాల్లో సీసీ కెమెరాలు ఫుటేజీలు కీలంగా ఉంటాయి.

మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం..



వేటపాలెం స్టేషన్‌కి వారం రోజుల కిందటే బదిలీపై వచ్చాను. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించాను. వాటికి మరమ్మతు చేయడానికి దాదాపు రూ.1 లక్ష పైన ఖర్చువుతుందని గుర్తించాం. దీనికి ఎస్టిమేట్ వేసి త్వరలో మరమ్మతు చేయిస్తాం.

– ఎం వెంకటేశ్వర్లు, ఎస్సై, వేటపాలెం

చిల్లర దొంగల హల్‌చల్ ..

వేటపాలెంలో చిల్లర దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఇవి కాక అక్కడడక్కడా చిన్నాచితకా దొంగతనాలు జరుగుతున్నాయి. ఇవి పోలీసు స్టేషన్ వరకు రావడం లేదు. ఇటీవల వన్ వే రోడ్డు రెండు దుకాణాల్లో చిల్లర దొంగలు తలుపు పగులగొట్టడానికి ప్రయత్నించి అవి రాకపోవడంతో పారిపోయారు. ఐదే నెలల కింద ప్రధాన రహదారిలో నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఆటో డ్రైవర్ సెంటర్ లోవదిలి పెడతానని నమ్మబలికి ఆటో ఎక్కించుకున్నాడు. తీరా ఆవృద్ధుడి దగ్గర ఉన్న రూ.10 వేలు నగదు తీసుకొని వృద్ధుడిని రామాలయం వద్ద దించి పారిపాయాడు. అయితే దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సెంటర్‌లో సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో ఆటోను గుర్తించలేకపోయారు.


ప్రధాన సెంటర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

పట్టని క్రైం పార్టీ పోలీసులు..

గ్రామంలో ప్రధాన సెంటర్‌లో సింగిల్ నంబర్ జూద గాళ్లు విపరీతంగా పెరిగిపోయారు. సెంటర్ నుంచి బైపాస్, కుందేరు రోడ్డులో దగ్గరలో గంజాయి మత్తులో యువకులు హల్‌చల్ చేస్తుంటారు. రాత్రి గస్తీ నామమాత్రగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. అయితే అధిక శాతం క్రైమ్ పార్టీలు నేరం జరిగాక హడావుడి చేయడం మినహా, ఇవి జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యామరనే విమర్శిన్నాయి. క్రైమ్ పార్టీలు అసలు విధులను పక్కనబెట్టి అధికారులకు ఆదాయవనరులు చేకూర్చే పనులకే పరిమి తమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శ్రావణ మాసం, శతభిషం నక్షత్రం విదియ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

హెచ్‌ఐవీ రహిత సమాజమే ధ్యేయం

- కరపత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచాలి
- కొరిశపాడు ఎస్సై సురేష్ వెల్లడి

నాగులుప్పలపాడు: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సంక్రమించకుండా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొరిశపాడు ఎస్సై వై.సురేష్ పేర్కొన్నారు. స్థానిక నాగులుప్పలపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వంతో పాటు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కూడా కృషి చేయడం అభినందనీయమన్నారు. సంస్థ మేదరమిట్ల టీఐ ప్రాజెక్టు ప్రతినిధి బీవీ సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన మండలితో పాటు తాము కూడా విరివిగా ప్రచారాన్ని చేపట్టామన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి 8 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌కే లాలీ సాహెబ్, ఎస్. శ్రీనివాసరావు, ఈదుమూడి ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఈ- పంట నమోదు చేయాలి

మద్దిపాడు: రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలను ఇ- పంటలో నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ సుజన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏలకు వీఆర్‌ఓలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ప్రస్తుతం ఉన్న జామాయిల్, ఉద్యానవన పంటలు, కూరగాయలు, మేత పంటలను వీఆర్‌ఓ, వీఏఏల ద్వారా ఇ- పంటలో నమోదు చేయించుకోవాలని సూచించారు. దీని వలన ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు నష్ట పరిహారం అందుతుందని తెలిపారు. ఏఓ రమేష్ మాట్లాడుతూ కౌలు రైతులంతా తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను సబ్సిడీపై పొందవచ్చని తెలిపారు.